సాక్షి పల్నాడు

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



మల్లేశ్వరునికి రూ.61.17 లక్షలు

పెదకాకాని: మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకలు శుక్రవారం లెక్కించారు. ఆదాయం రూ.61,17,251 సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



అందుబాటులోకి 'డిజియాత్ర'

గన్నవరం: విమాన ప్రయాణికుల బోర్డింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు రూపొందించిన డిజియాత్ర సేవలను శుక్రవారం ఎయిర్ పోర్టులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు.

కరోనా - జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
నరసరావుపేట	6:28	4:43
గుంటూరు	6:26	4:46
బాపట్ల	6:26	4:46

న్యూస్‌రీల్

డెప్యూటీ డీఈఓగా వేణుగోపాలరావు




నరసరావుపేట ఈస్ట్: జిల్లా ఉప విద్యాశాఖాధికారిగా కె.వేణుగోపాలరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్.టి.ఆర్.జిల్లా డీఈఓ కార్యాలయం ఏడీ సర్వీసెస్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. గతంలో ఉమ్మడి గుంటూరుజిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం సూపరింటెండెంట్‌గా, ఉమ్మడి కృష్ణా జిల్లా మధ్యాహ్న భోజన పథకం ఏడీగా పనిచేశారు. మరో రెండు రోజులలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండటంతో పరీక్షల విజయవంతానికి కృషి చేస్తానని తెలిపారు. డిప్యూటీ డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, డీఈఓ కె.శామ్యూల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మార్చిలో అధిక వర్షపాతం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో మార్చి నెలలో సాధారణ వర్షపాతానికి మించి మూడు రెట్లు అధిక వర్షపాతం నమోదైంది. మార్చి నెలలో 249.6 మిల్లీ మీటర్ల సాధారణ వర్షం కాగా 1021.0 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలోని 28 మండలాల్లో సగటున 8.9 మి.మీ పడాల్సి ఉండగా 36.5 మిల్లీమీటర్లు కురిసిందని వాతావరణ శాఖ విభాగం విడుదల చేసిన మేరకు నిర్ధారణవుతుంది. నాదెండ్ల మండలంలో సాధారణ వర్షం రెండు మి.మీ. కాగా అత్యధికంగా 82.4 మి.మీ పడింది. క్రోసూరు, పెదకూరపాడు, నూజెండ్ల మండలాల్లో సాధారణ వర్షం కంటే తక్కువగా వర్షం నమోదైంది.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 529.50 అడుగుల వద్ద ఉంది. ఇది 167.1730 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 3,144, ఎడమకాలువకు 7,518, ఎస్ఎల్‌బీసీకి 2,000, వరదకాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 12,982 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 12,982 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 806.40 అడుగుల వద్ద ఉంది. ఇది 32.2875 టీఎంసీలకు సమానం.

వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

గుంటూరుమెడికల్: మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ భాగ్యరత్నం, మల్టీ హెల్త్ సూపర్‌వైజర్ (ఎంపీహెచ్ఎస్) దాస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారన్నారు. ఆ సమయంలో సీనియర్ అసిస్టెంట్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదనే విషయం వెలుగులోకి వచ్చిందని వెల్లడించారు. సూపర్‌వైజర్ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమాధానాలు చెప్పకపోవడంతో వారివురికి కలెక్టర్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. షోకాజ్ నోటీసులకు మూడురోజుల్లో ఇరువురు సమాధానం ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు.

పులిచింతల నీటి నిల్వ



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.2071 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 3200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దిగువకు 2000 క్యూసెక్కులు వదులుతున్నారు.

చీకట్లను చీల్చిన

రంగస్థల కళా కాంతులు

- అట్టహాసంగా ప్రారంభమైన జాతీయస్థాయి నాటికల పోటీలు
- ప్రజానాట్యమండలి కళాకారులు వీధి ప్రదర్శన
- తొలిరోజు ముచ్చటగా మూడు కళారూపాల ప్రదర్శనలు



సినీనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజకు సుందరయ్య పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

యడ్లపాడు: పుచ్చలపల్లి సుందరయ్య 20వ జాతీయ స్థాయి తెలుగు సాంఘిక నాటిక పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రంగస్థల, ప్రజానాట్యమండలి కళాకారుల రాకతో గ్రామంలో కోలాహలంగా మారింది. ఊరంతా ఫ్లెక్సీలు, భారీ విద్యుత్ దీపాలంకరణలు శోభిల్లుతూ సాదర స్వాగతం పలికాయి. సాయంత్రం 4 గంటలకే గజ్జెకటి.. డప్పు చేతపట్టి చిందేస్తూ.. అభ్యుదయ గీతాలతో చైతన్యం చేస్తూ.. సమకాలిన సమస్యలపై వీధి ప్రదర్శనలతో జనజాగృతి చేశారు. ఇలా పొద్దుపొడుపు మొదలు అర్ధరాత్రి వరకు కళల జాతర జరిగింది. వీటిని చూసేందుకు కళాపోషకులు, కళాభిమానులు స్థానికులే కాకుండ సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. తొలిరోజు మూడు నాటికలు ప్రదర్శించారు.

పెళ్లంటే..బాధ్యత అని చెప్పిన 'ఎస్–11'

ప్రపంచంలోనే ఆదర్శవంతమైన కుటుంబ వ్యవస్థ కలిగిన దేశం మనది. ప్రేమ లేదా పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు పెటాకులావుతున్నాయి. వీటిలో అత్యధికంగా ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడమే. అహం.. పరువు పేర్లు పెట్టి అతిచిన్న విషయాన్ని భూతద్దంలో చూపి ఇంటిగుట్టును కోర్టుకు ఈడ్చీ విడాకులు పొందుతున్నారు. పచ్చని జీవితంలో తామే చిచ్చుపెట్టుకుంటూ జీవితాల్ని ఒంటరిమయం చేసుకుంటున్నారు. జీవితమంటే నేలపై ఉండే రైలు పట్టాలు కావు.. వాటిపై ప్రయాణించే రైలుబండి అని, దంపతులు అందులో ఓ జీవితకాలం కలిసి ప్రయాణించాల్సిన వారని అర్థం చెప్పే నాటిక 'ఎస్–11'. పరుచూరి వెంకటేశ్వరరావు రచనకు పి.బాలాజీ నాయక్ దర్శకత్వం వహించిన చైతన్య కళా స్రవంతి ఉక్కునగరం(విశాఖ) వారు సమర్పించారు.

'కొత్త పరిమళం' అందించాలి...

కొత్త పరిమళం నాటిక భావి తరాలకు స్ఫూర్తిదాయకం. కె.శ్రీనివాసరావు మూలకథకు కేకేఎల్ స్వామి నాటకీకరణ, బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించిన అ నాటికను శార్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవాసంఘం బోరివంక(శ్రీకాకుళం) వారు సమర్పించారు. కొడల్ని 'కూతురిగా స్వీకారం' చేసుకున్న అత్తమామల కథ. చుండూరి ఉమాబాల మూలకథకు, రావి నాగేశ్వరరావు నాటకీకరణ గావించి జనాబ్ షహీన్‌షా దర్శకత్వం వహించిన రసవాహిని (అమలాపురం) వారు సమర్పించారు.



ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శన

సుందరయ్య కళా పురస్కారం దక్కడం నా అదృష్టం

సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

యడ్లపాడు: ఆదర్శ రాజకీయనేత పుచ్చలపల్లి సుందరయ్య పురస్కారం అందుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు. స్థానిక సుందరయ్య జాతీయస్థాయి నాటికల పోటీల ప్రారంభోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. సుందరయ్య త్యాగం, పోరాటం, నిబద్ధతను అనుసరణీయమని పేర్కొన్నారు. ఖమ్మంజిల్లా క్యూర్ హాస్పిటల్ అధినేత పోపూరి రవిమారుతి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ, ప్రజానాట్యమండలి నాయకులు నూతలపాటి కాళిదాసు ప్రసంగించిన వారిలో ఉన్నారు. అనంతరం సుందరయ్య కళా పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ముందుగా సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని అతిధులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నిర్వాహకులు ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముత్తవరపు పద్మారావు, జరుగుల శంకరరావు, ముత్తవరపు రామారావు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- రెవెన్యూ, పోలీసు, విద్యాసంస్థల అధికార్లతో ఫ్లయింగ్ స్క్వాడ్లు
- ప్రతి గ్రామం నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, వేదికపై డీఆర్వో వినాయకం

నరసరావుపేట: పదో తరగతి పరీక్షలు మూడో తేదీ నుంచి 18వ తేదీ వరకు ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరీక్షల నిర్వహణపై అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 126 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు 24,354 మంది రెగ్యులర్ అభ్యర్థులు, 1,946 ప్రైవేటు అభ్యర్థులు మొత్తం 26,300 మంది హాజరవుతారన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని కేంద్రాలలో సీసీ టీవీలు అమర్చినట్లు వివరించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్లను రెవెన్యూ, పోలీస్, విద్యాసంస్థలకు చెందిన అధికారులతో వేయాలని తెలిపారు. పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద తాగునీటి సరఫరా ఉండాలని, వైద్య ఆరోగ్య శాఖ ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ నిరంతర సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. ఆర్టీసీ పరీక్ష సమయంలో అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి గ్రామం నుంచి ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాలలో జిరాక్స్ షాపులను పరీక్ష సమయం పూర్తయ్యేంతవరకు మూసి ఉండేలా చర్యలు చేపట్టాలని పోలీస్‌లను ఆదేశించారు. విద్యార్థులందరూ పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో రెండో స్థానంలో గుంటూరు

చివరి రోజు రూ.10.03 కోట్లు రాక



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పన్నులు వసూలు చేసి గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. శుక్రవారం ఒక్కరోజే రూ.20.55 కోట్లు వసూలు చేసి విశాఖపట్నం మొదటి స్థానంలో నిలవగా, రూ.10.03 కోట్లతో గుంటూరు నగరపాలక సంస్థ రెండో స్థానంలో నిలిచింది. గతేడాది ఇదే రోజున రూ.4.30 కోట్లు వసూలు చేయగా ప్రభుత్వం ఈసారి ఆస్తి పన్ను వసూలుపై వడ్డీ రాయితీ ఇవ్వడంతో శుక్రవారం ఒక్కరోజే రూ.10.03 కోట్లతో గతేడాది కంటే ఈసారి రెట్టింపు వసూలు చేశారు. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పన్ను వసూలుకు ప్రత్యేక కృషి చేసిన అధికారులకు, కార్యదర్శులకు, ఇతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

మహా పుష్పార్చనతో పరిసమాప్తం

దుర్గమ్మ సన్నిధిలో ముగిసిన వసంతోత్సవాలు



విశేష పుష్పార్చనలో అమ్మవారు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం మహా పుష్పార్చన నిర్వహించారు. 22వ తేదీ నుంచి 31వ తేదీ వరకు దుర్గమ్మ సన్నిధిలో వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. 9 రోజుల పాటు విశేషమైన పుష్పాలతో అర్చన నిర్వహించగా, ఉత్సవాలలో చివరి రోజైన శుక్రవారం అమ్మవారికి మహా పుష్పార్చన నిర్వహించారు. 9 రకాల పుష్పాలతో అర్చన నిర్వహించారు. తొలుత ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ఏఈవో ఎన్ రమేష్‌బాబులతో పాటు ఆలయ సిబ్బంది అమ్మవారి అర్చన కోసం తీసుకువచ్చిన పుష్పాలను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి వేద మంత్రోచ్ఛరణ మధ్య విశేష పుష్పార్చన నిర్వహించిన అనంతరం పంచ హారతుల సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు

ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న వసంత నవరాత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ అర్చకులు పూర్ణాహుతి జరిపించారు. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జుల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు యజ్ఞనారాయణశర్మ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో భ్రమరాంబకు అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, అమ్మవారి ప్రసాదాలను బహూకరించారు.

ప్రియురాలే ప్రాణం తీసింది

- కొంత కాలంగా ఇద్దరు సహజీవనం
- గురువారం అర్ధరాత్రి ఘటన
- గుర్తు తెలియని వ్యక్తులు చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు
- పోలీస్ విచారణలో దొరికిన ప్రియురాలు



నిందితురాలు ఆమని



గద్దె రాము(ఫైల్)

తెనాలి రూరల్: సహజీవనం ఓ యువకుడి ప్రాణం తీసింది. ప్రియుడి గొంతు కోసి కిరాతకంగా హతమర్చడమే కాకుండ ఎవరో హత్య చేసి వెళ్లారంటూ పోలీసులకు నమ్మించేందుకు ప్రయత్నించింది. పోలీసులు కథనం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన తన్నీరు ఆమని ఎనిమిదేళ్ల క్రితం భర్త, ఇద్దరు పిల్లలతో కలసి తెనాలి వచ్చింది. మండలంలోని కఠెవరం పరిధిలో కాల్వ కట్టపై నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆమనికి పట్టణంలోని చెంచుపేటకు పెయింటర్ గద్దె రాము(29) పరిచయమయ్యాడు. పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. విషయం తెలుసుకున్న భర్త మూడేళ్ల క్రితం భార్య, పిల్లలను వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి రాముతో సహజీవనం చేస్తోంది. ఇటీవల మరో ఇద్దరితో చనువుగా ఉంటోందని రాము గ్రహించారు. గురువారం రాత్రి పూటుగా మద్యం తాగి వచ్చిన రాము ఆమెను దూషిస్తూ ఉన్నాడు. అర్ధరాత్రి దాటాక ఇంట్లోని చాకుతో అతడి గొంతు కోయడంతో మృతి చెందాడు.

గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని..

రామును ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని పోలీసులకు ఆమని సమాచారమిచ్చింది. ఇంటి బయట మద్యం తాగుతున్న రాముపై వారు కత్తితో దాడి చేసి వెళ్లగా, తలుపు తెరచుకుని ఇంటి లోపల పడిపోయి మృతి చెందాడని పోలీసులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసింది. రూరల్ ఎస్ఐలు సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంను రప్పించారు. ఇంట్లో పెనుగులాట జరిగిన ఆనవాళ్లను గుర్తించిన పోలీసులు ఆమనిపై అనుమానంతో ఆమెను గట్టిగా ప్రశ్నించగా నేరం అంగీకరించింది. మృతదేహాన్ని శుక్రవారం ఉదయం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని, ఇతరుల పాత్ర ఉందా అన్న విషయాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని పోలీసుల తెలిపారు.

హామీల అమలు ఘనత జగన్‌దే

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- చిరుమామిళ్లలో వైఎస్సార్ ఆసరా వేడుకలు
- రూ.9.13 కోట్ల రుణ మాఫీ జమ



డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చెక్కును అందిస్తున్న మంత్రి రజిని

నాదెండ్ల: సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలు తెలుసుకొని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసేందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కొనియాడారు. పల్నాడు జిల్లా చిరుమామిళ్ల నడికట్టు లక్ష్మీరాజ్యం, రామిరెడ్డి కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా వేడుకలు శుక్రవారం నిర్వహించారు. మండల పరిధిలో 1,116 స్వయం సహాయక సంఘాలకు గాను రూ.9,13,12,470 మూడో విడత రుణమాఫీ చెక్కును అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 641 గ్రూపులకు గాను రూ.48.75 కోట్లు బ్యాంకు లింకేజీ పొందిన మొత్తాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు మహిళలను దారుణంగా మోసం చేశాడని, అప్పట్లో మహిళలను ఓట్లు వేయించుకున్న చంద్రబాబు, బ్యాంకుల్లో ఉన్న బంగారాన్ని నేరుగా ఇంటికే పంపిస్తానని చెప్పి, ఆంక్షలతో మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. పసుపు కుంకుమ పేరుతో మరోసారి మోసానికి తెరలేపారన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో రూ.25 వేల కోట్ల రుణమాఫీని డ్వాక్రా మహిళలకు హామీ ఇచ్చి ఇప్పటికే మూడో విడతలో రూ.19 వేల కోట్లు రుణ మాఫీ చేశారన్నారు.

30 లక్షల మంది మహిళలకు ఇళ్ల స్థలాలు...

రాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో మహిళల పేరిట 30.76 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఉచితంగా అందజేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వందేనని మంత్రి రజిని పేర్కొన్నారు. ఇప్పటికే 22 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తకావస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా అక్కాచెల్లెమ్మల కుటుంబాలకు సగటున రూ.10 లక్షల మేర లబ్ది చేకూరిందన్నారు. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో మహిళకు అత్యధిక స్థానాలు కేటాయించినట్లు చెప్పారు. 2024 సాధారణ ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలని మహిళలు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బాలికల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, కిశోర బాలికలకు ఉచితంగా శానిటరీ నాప్‌కిన్లు, భద్రత కోసం దిశయాప్, పోలీస్‌స్టేషన్లు, మహిళా పోలీసుల నియామకం వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం మహిళలతో కలసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. చేయూత, ఆసరా పథకం లబ్ధిదారులు 70 మందికి కుట్టుమిషన్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచి సింగారెడ్డి లక్ష్మి, ఉపసర్పంచి మేకల హనుమాయమ్మ, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాత, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు యామర్తి సునీత, గణపవరం, నాదెండ్ల సొసైటీల అధ్యక్షులు సింగారెడ్డి కోటిరెడ్డి, కాట్రు రమేష్, కోఆప్షన్ సభ్యులు మూసా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుసేన్, ఏపీఎం భరత్, డీటీ అనూరాధ పాల్గొన్నారు.

రైతు సాధికారత దిశగా కృషి

- రైతును రాజును చేసేందుకే..
- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- లాంఫాం పరిశోధన స్థానం శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి చిత్రంలో వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు రూరల్: రైతు సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మండలిలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శతాబ్ది వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కృషీవలుని విగ్రహం, నూతన భవనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు గ్రామంలోనే అన్నిరకాల సేవలు, విత్తనాలు, ఎరువులు, క్రయవిక్రయాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి వంద సంవత్సరాలుగా కృషి చేసిన శాస్త్రవేత్తలు, అధికారులను అభినందించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నపాటి పరిశోధన స్థానంగా శతాబ్ది కాలంలో వందల రకాల నూతన వంగడాలను అందించిన ఘనత లాంఫాంకు ఉందని చెప్పారు. వ్యవసాయ రంగంలో ఆధునికీకరణ, సేంద్రీయ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలను వివరించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని వ్యవసాయ రంగాన్ని మరింత మెరుగు దిశగా అభివృద్ధి చేయాలన్నారు. వందేళ్ల కాలంలో లాంఫాం సాధించిన ఘనతను ఏడీఆర్ డాక్టర్ సుబ్బారావు వివరించారు. మాజీ వైస్ చాన్సలర్, ఏపీ స్టేట్ అగ్రిమిషన్ పర్మినెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ పీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయరంగంలో విస్తృత పరిశోధనలు చేసి రైతుల మేలుకు పాటుపడిన శాస్త్రవేత్తలను అభినందించారు. రైతులు స్వయంగా ఎద్దుల బడ్లను తెచ్చి అలంకరణలు ఆకట్టుకున్నాయి. రైతులు పండించే పంటలతో నిండిన ఎద్దుల బండ్లు, సంప్రదాయ వస్త్రాలంకరణ చూపరులను ఆకర్షించాయి. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకురాలు డాక్టర్ విజయాభినందన, మాజీ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ, డాక్టర్ ఎన్వీ నాయుడు, మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.జగన్నాథం, మాజీ డీన్ డాక్టర్ ఎలమందారెడ్డి మాట్లాడారు.. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిపాలన అధికారులు డాక్టర్ ఎ.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ చిరంజీవి, డాక్టర్ ఎ.మణి, డాక్టర్ పీ సాంబశివరావు, డాక్టర్ ఏపీ రమణ, డాక్టర్ పీ సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్స్ ట్రోఫీ త్రోబాల్ పోటీలు ప్రారంభం



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా అవతరణ వేడుకల్లో భాగంగా చేపట్టిన కలెక్టర్స్ ట్రోఫీ త్రోబాల్ పోటీలు స్థానిక డీఎస్ఏ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి 13 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి, త్రోబాల్ ఇన్‌చార్జ్ వరలక్ష్మి, ఛీఫ్ కోచ్ చావలి శ్రీనివాసరావు పాల్గొన్నారు. విజేతలకు ఏప్రిల్ 4న నిర్వహించనున్న పల్నాడు జిల్లా అవతరణ దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నారు.

ఆడిట్ ఎన్జీఓ అసోసియేషన్ కొత్త కార్యవర్గం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా ఆడిట్ ఎన్జీఓ అసోసియేషన్ కొత్త అధ్యక్షుడిగా డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా వై.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలోని జిల్లా ఆడిట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా బి.మరియదాసు, బి.అబ్రహం, కోశాధికారిగా పి.జయకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్.బాజీమస్తాన్, సహాయ కార్యదర్శులుగా ఎం.శ్రీకాంత్, షేక్.ఖాసిం ఉమర్, కౌన్సిల్ సభ్యులుగా ఎం.కోటేశ్వరరావు, సీహెచ్.రాంకీ, యు.షెబారాణి ఎన్నికయ్యారు.

21న నరసరావుపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసరావుపేట: స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు ఈనెల 21న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ చైర్మన్ శ్రీగిరిరాజు అయ్యపరాజు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి పదవులకు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 13 వరకు మూడురోజుల పాటు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, ఈనెల 17న 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల్లోపు నామినేషన్లు పరిశీలన జరుగుతుందని వెల్లడించారు. పోటీచేసే అభ్యర్థుల చివరి జాబితాను ఈనెల 19 సాయంత్రం 5 గంటల్లోగా వెల్లడిస్తామని వివరించారు. 21న పోలింగ్, కౌంటింగ్ ఉంటాయని వెల్లడించారు.

చంద్రబాబు, లోకేష్ మాటలు నమ్మొద్దు

- హామీలిచ్చి మోసం చేసిన చరిత్ర వారిది
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- కారెంపూడి మండలంలో వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత



చెక్కు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్ చెప్పే మాటలు నమ్మొద్దని, ఎన్నికల ముందు నానా హామీలిచ్చి, ఆ తర్వాత మోసం చేసిన చరిత్ర వారిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కారెంపూడి మండలంలోని 944 డ్వాక్రా గ్రూపుల్లోని 9,452 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత సాయంగా రూ.69.41 కోట్ల విలువైన చెక్కును శుక్రవారం పీఆర్కే మహిళలకు అందించారు. అలాగే 193 సంఘాల్లోని 759 మంది మహిళలకు శ్రీనిధి బ్యాంకు ద్వారా మంజూరైన రూ.3.39 కోట్ల మేర రుణాల చెక్కులను పీఆర్కే పంపిణీ చేశారు. పీఆర్కే మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని నానా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసం చేసిన విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలూ అమలు చేశారని, ఆసరా ద్వారా ఇప్పటికి మూడు విడతలుగా రూ.19,137 వేల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారని, నాలుగో విడత కూడా రూ.6,380 కోట్లు అందించనున్నారని వివరించారు. పిల్లల చదువుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న లబ్ధిని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. మోసకారి చంద్రబాబు మాటలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. తొలుత డ్వాక్రా మహిళలు ప్రభుత్వ విప్ పీఆర్కేతో కలిసి వైఎస్సార్, సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం పల్నాడు జిల్లా పథక సంచాలకులు బి.బాలునాయక్, జెడ్పీటీసీ షేక్ షఫీ పాల్గొన్నారు. ఇటీవల పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన షేక్ అక్బర్‌ను, వివిధ గ్రామాల నాయకులను ప్రభుత్వ విప్ పీఆర్కే సత్కరించారు. అనారోగ్యంతో మృతి చెందిన షేక్ సుభాని భార్య చమేల్‌కు రూ.5 లక్షల వైఎస్సార్ బీమా చెక్కును పీఆర్కే పంపిణీ చేశారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి

- కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- అధికారులతో సమీక్ష
- సమష్టిగా పనిచేయాలని ఆదేశం



సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, డీఆర్వో వినాయకం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి కలిసి సమీక్ష నిర్వహించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం అమలుపై కలెక్టర్ చైర్మన్ హోదాలో సమీక్షించారు. జిల్లాలో క్షేత్రస్థాయి నుంచే మాదకద్రవ్యాల నిర్మూలనపై కృషి జరగాలని, మాదక ద్రవ్యాల వల్ల తలెత్తే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. విద్యాశాఖ, పోలీసు, అనుబంధ శాఖలైన వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, ఎస్ఈబీ, మాదక ద్రవ్యాల నియంత్రణ శాఖల ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మద్యం అలవాట్ల నుంచి కాపాడేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం, మత్తు పదార్థాల నిర్మూలనకు చేస్తున్న కృషిని వివరించారు. గ్రామస్థాయి నుంచే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. గుంటూరు జిల్లా సమగ్ర వైద్యశాల మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సాయికిరణ్ మాదకద్రవ్యాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. నిర్దిష్ట కాలపరిమితిని విధించుకొని ప్రతి అధికారి పనిచేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారి ఐ.అరుణ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చంద్రశేఖరరెడ్డి, విద్యుత్తు శాఖ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి బాలునాయక్, మెప్మా ప్రాజెక్ట్ అధికారి జోసఫ్ కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, జిల్లా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డెప్యూటీ అధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్, డీడీవో కె.మహాలక్ష్మి, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారిణి సువార్త పాల్గొన్నారు.

రైతులకు మట్టి నమూనా కార్డులు అందజేయండి



సమావేశంలో చైర్మన్ సాయి మార్కొండారెడ్డి, డీఆర్వో వినాయకం, వ్యవసాయాధికారి మురళి

నరసరావుపేట: వేసవిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా మట్టి నమూనాలను సేకరించి పరీక్షించిన ఫలితాల కార్డులను రైతులకు అందజేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి వ్యవసాయాధికారులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం మార్కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే జూలై నుంచి రైతులకు కావాల్సిన టార్పాలిన్లు, స్ప్రేయర్లు సబ్సిడీపై అందజేయనున్నట్టు వివరించారు. ఆర్‌బీకేలలోని కియోస్క్ ద్వారానే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మకం జరపాలని కోరారు. డీఆర్వో కె.వినాయకం మాట్లాడుతూ సమావేశంలో సమీక్షించిన అంశాలు తర్వాత సమావేశం నాటికి పరిష్కరించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఏరువాక కేంద్రం ఏర్పాటు చేసినట్టు వివరించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, మొక్కజొన్న తదితర పంటలకు జరిగిన నష్టాన్ని ఆర్‌బీకేల వారీగా అంచనా వేసినట్టు వెల్లడించారు. గ్రామాల్లో సామాజిక తనిఖీ అనంతరం నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపుతామని పేర్కొన్నారు.

చిలకలూరిపేట మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు తెలియజేయండి

నరసరావుపేట: చిలకలూరిపేట మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలను 30రోజుల్లో తెలియజేయాలని పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (పౌడా) వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం, చిలకలూరిపేట మున్సిపాల్టీ సంయుక్తంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాయని, దీని కోసం గెజిట్ నోటిఫికేషన్ కలెక్టర్ ఎల్.శివశంకర్ ద్వారా మార్చి 29న నోటిఫై చేశారని పేర్కొన్నారు. దీనిపై అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. ప్రజల పరిశీలనార్థం చిలకలూరిపేట మున్సిపాలిటీ, నరసరావుపేటలోని పౌడా కార్యాలయాల్లో మాస్టర్ ప్లాన్ నకలును అందుబాటులో ఉంచినట్టు వివరించారు.

కేఎల్‌యూ ప్రవేశ ఫలితాల విడుదల

విడుదల చేసిన ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం విడుదల చేశారు. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో అమర్‌నాథ్ పాల్గొని బటన్ నొక్కి ఫలితాలు విడుదల చేసి, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఉపయోగపడే పరిశోధనలపై యువత దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చదువు పూర్తి చేసుకుని విద్యార్థి బయటకు వచ్చిన వెంటనే ఉద్యోగం కల్పించాలన్న లక్ష్యంతో స్కిల్ హబ్ సెంటర్ ద్వారా తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో ఐ స్పేస్ పేరిట ఐకానిక్ బిల్డింగ్ ఏర్పాటు కానుందన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందని, పలు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని, మన విద్యార్థులకు ఇక్కడే మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు వచ్చేలా పటిష్ట కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. కేఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలు www. kluniversity. in వెబ్‌సైట్‌లో లభిస్తాయని తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షణ్ముఖ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్స్ బీఎస్ఎన్ మూర్తి, హెచ్ఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

హోంగార్డుల సేవా దృక్పథం గొప్పది

ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



హోంగార్డు నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఏఎస్పీ బిందుమాధవ్

నరసరావుపేట: హోంగార్డుల సేవా దృక్పథం ఎంతో గొప్పదని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి కొనియాడారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు చంద్రశేఖర్‌రెడ్డి, తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వారిద్దరిని సత్కరించారు. వీరు నలభైఏళ్లుగా పోలీస్‌శాఖకు ఎనలేని సేవలందించారంటూ వారి సేవలను ఎస్పీ కొనియాడారు. ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందటం అనేది ఎంతో సంతోషకరమైన విషయమని, మిగిలిన శేషజీవితం కూడా ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్, హోంగార్డు ఆర్ఐ రవికిరణ్ పాల్గొన్నారు.

ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్‌గా బ్రహ్మాచారి



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ డ్యాం, శ్రీశైలం, మిర్యాలగూడ పరిధిలోని యుబీఐ బ్యాంక్ పర్యవేక్షణకు (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్‌గా కె.బ్రహ్మాచారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నాగార్జునసాగర్ ఎస్పీఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాగార్జునసాగర్ డ్యాం, శ్రీశైలం ప్రాజెక్టు, జలవిద్యుత్ కేంద్రాల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేసిన చంద్రశేఖర్ పాల్వంచకు బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ కమాండెంట్ బ్రహ్మాచారికి సాగర్ డ్యాం ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, జెన్‌కో ఆర్ఐ నరేష్‌లు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఇన్విజిలేటర్ల నియామకంలో గుంటూరు నగ, రూరల్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టిబోయిన నరసింహారావు కోరారు. ఈమేరకు శుక్రవారం డీఈవో కార్యాలయంలో డీఈవో పి.శైలజను కలిసి వినతి పత్రం సమర్పించారు. టెన్త్ పరీక్షల విధులకు ఎస్జీటీలతో పాటు భాషా పండిట్లు, పీడీలను నియమించారని, అయితే వీరిలో అనేక మంది వివిధ కారణాలతో అధికారులను మినహాయింపు కోరగా, ఎటువంటి విచారణ లేకుండా మినహాయింపులు ఇచ్చారని తెలిపారు. అదే విధంగా నగరపాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్, సబ్జెక్టు ఉపాధ్యాయులను అసంబద్ధంగా నియమించారని, ఈ విషయంలో గుంటూరు రూరల్ ఎంఈవో అత్యుత్సాహంతో చేతివాటం ప్రదర్శించారని డీఈవో దృష్టికి తెచ్చారు. గతంలో సైతం సదరు ఎంఈవోపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తున్న సంఘటనలు సైతం చోటు చేసుకున్నాయని తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న మినీవ్యాను

11 మందికి గాయాలు, ఒకరి మృతి



ప్రమాద సంఘటనలో ఢీకొన్న మినీ వ్యాను, ఆర్టీసీ బస్సు

మేడికొండూరు: రోడ్డుపై వస్తున్న ఆర్టీసీ బస్సును, ఎదురుగా వస్తున్న మినీ వ్యాను బలంగా ఢీకొన్న సంఘటనలో 11 మందికి గాయాలు కాగా ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల నరసరావుపేట బ్రిడ్జిపైన శుక్రవారం జరిగింది. గుంటూరు నుంచి ప్రయాణికులతో నరసరావుపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సును, నరసరావుపేట నుంచి రేపల్లె వెళ్తున్న మినీవ్యాను ముందు వెళుతున్న కారును అధికమించే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో మినీవ్యానులో ప్రయాణిస్తున్న రేపల్లెకు చెందిన డ్రైవర్ హరిదాసు సాయికృష్ణ (22), అతని భార్య రేఖలకు తీవ్రగాయాలయ్యాయి. వేగంగా బస్సుమీదకు మినీ వ్యాను దూసుకురావడం.. డ్రైవర్ సడన్ బ్రేకు వేయడంతో బస్సులో పదిమంది ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సాయికృష్ణ మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాద సంఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ మార్గాన ప్రయాణిస్తున్న గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు పరిస్థితి గమనించి కారుదిగి వచ్చి రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాలను క్రేన్ ద్వారా తొలగించేందుకు అధికారులతో మాట్లాడారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- నాడు–నేడుతో కార్పొరేట్ స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు



జగనన్న గోరుముద్ద పథకం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

బొల్లాపల్లి: 10వ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. మండలంలోని వెల్లటూరు గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌ను ఎంపీ సందర్శించారు. బోధన, మధ్యాహ్న భోజన పథకం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉత్తీర్ణతతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, గ్రామీణ ప్రాంత విద్యకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుకున్నాయని, విద్యార్థులకు బోధనాపరంగా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడా ప్రాంగణం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు ఎంపీని కోరారు. ఈ మేరకు క్రీడా పారంగణం అభివృద్ధికి సహకరిస్తానని, ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.